సాక్షి నల్లగొండ

బుధవారం ❘ 13 ❘ నవంబర్ ❘ 2024



రైతులకు బోనస్ కలేనా..?

17శాతం తేమ నిబంధనతో రైతులు బోనస్ విషయం పట్టించుకోకుండా ధాన్యాన్ని నేరుగా మిల్లుల్లోనే విక్రయిస్తున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 586.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: నిల్
అవుట్ ఫ్లో	: 45,634 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,785
కుడికాల్వ ద్వారా	: 10,200 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,849 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.89 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 369.47 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 369.47 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నాగార్జునసాగర్: ఈఎంఆర్ఐ(108) సంస్థలో పైలెట్ (డ్రైవర్) ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మేనేజర్ ఎల్లావుల మధు మంగళవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండటంతో పాటు 25నుంచి 35 సంవత్సరాల వయస్సు, ఎల్ఎంవీ బ్యాడ్జ్ కలిగి ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 14న నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల లోపు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 91542 51994 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నల్లగొండకు రానున్నారు. హైదరాబాద్ నుంచి 10.30 గంటలకు నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయానికి చేరుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నల్లగొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కోమటిరెడ్డి పాల్గొంటారు.

సైన్స్ ఫెయిర్‌లు సృజనాత్మకతను వెలికితీస్తాయి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ: సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళవారం నల్ల గొండ డైట్ కళాశాలలో నిర్వహించిన గణిత, సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఆయా రంగాల్లో స్ఫూర్తివంతమైన శాస్త్రవేత్తల విషయాలను ఉపాధ్యాయులు వివరించాలన్నారు. అప్పుడే విద్యార్థులు ప్రేరణ పొంది నేటి సామాజిక పరిస్థితుల కనుగుణంగా వినూత్న ప్రాజెక్టులు తయారు చేస్తారని తెలిపారు. ఈనెల చివరి వారంలో జరగనున్న జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రాజెక్టులు ప్రదర్శించేలా సైన్స్, గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో 2023–24 వరకు ఎంపిక చేయబడిన ఇన్‌స్పైర్ మనక్ 114 ప్రాజెక్టులు కూడా పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల సైన్స్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం తప్పనిసరి

మునుగోడు: విద్యార్థులు ప్రతి రోజు పుస్తక పఠనం తప్పని సరిగా చేయాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి సూచించారు. మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన లైబ్రరీ పుస్తకాలను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అధికంగా 10జీపీఏ సాధించేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐది వందేళ్ల పోరాట చరిత్ర

నల్లగొండ టౌన్: ప్రజా కార్మిక, కర్షక సమస్యలపై పోరాటాలు చేయడంలో సీపీఐది వందేళ్ల చరిత్ర అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. మంగళవారం ఆయన నల్లగొండలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పబ్బు వీరస్వామి, బి.నర్సింహ, గంటా సత్యనారాయణ, గాదెపాక రమేష్, ముండ్లా ముత్యాలు, పాండరి, జె. సురేందర్, లెనిన్, ఎండీ యూసుఫ్, సుజాత, మాధవి, ఎస్. వీరయ్య, కె.ముత్తయ్య, పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు లక్ష పుష్పార్చన పూజలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. పూజలో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సర్వేపై సందేహాలెన్నో!

- సంక్షేమ పథకాలకు కోత వేస్తారన్న అనుమానాలు
- పెన్షన్లు తొలగిస్తారేమోనని ఆందోళన
- కోతలు ఏమీ ఉండవని వివరిస్తున్న ఎన్యుమరేటర్లు
- అయినా.. ఆస్తుల వివరాలు చెప్పేందుకు ససేమిరా
- సర్వేలో అడుగుతున్న ప్రశ్నలను దాటవేస్తున్న ప్రజలు

ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన సర్వేపై ప్రజల నుంచి సందేహాలెన్నో వ్యక్తమవుతున్నాయి. కుల గణన పేర ఆర్థిక ఇతర వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ఇతర ఉద్దేశాలతోనే ప్రభుత్వం సర్వే చేస్తుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. కులగణన చేస్తామని చెబుతున్న ప్రభుత్వం.. కులగణన మాత్రమే చేయకుండా 75 రకాల సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించి ఏమి చేయబోతుందనే చర్చ జరుగుతోంది.



నార్కట్‌పల్లి: గోపలాయపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన సర్వే ఈ నెల 9న ప్రారంభమైంది. జిల్లాలో 5,03,411 ఇళ్లలో, 3,832 మంది ఎన్యుమరేటర్లతో సర్వే కొనసాగుతోంది. సర్వే కోసం వెళ్లిన ఎన్యుమరేటర్లకు ప్రజలు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే దాటవేస్తున్నారు. ఆర్థిక వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, తదితర వాటిని చెప్పేందుకు ప్రజలు విముఖత చూపుతున్నారు. కులగణన కోసం ఇంత పెద్ద మొత్తంలో సర్వే చేయాల్సిన అవసరం లేదన్న వాదన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడం, వారికి వ్యవసాయ భూములు ఉన్నాయా.. ఉంటే ఎన్ని ఎకరాలున్నాయి.. ఎన్ని ప్లాట్లు ఉన్నాయి. బ్యాంకు ఖాతాల వివరాలు అడగటంతో పాటు కార్లు, ద్విచక్రవాహనాలు, ఇళ్లు ఎన్ని ఉన్నాయి తెలుసుకోవడంతోపాటు రైతు బంధు వస్తుందా రావడం లేదా అని అడుగుతున్నారు. రేషన్ కార్డు నెంబర్ తీసుకుంటున్నారు. దీంతో ప్రజల్లో సంక్షేమ పథకాలకు మంగళం పాడతారాన్న చర్చ మొదలైంది. ఆస్తులు, వాహనాల వివరాలు అడుగుతుండటంతో, అవి చెబితే భవిష్యత్‌లో రేషన్ కార్డును తొలగిస్తారని, దాంతో సంక్షేమ పథకాలన్నింటికి కోత పడుతుందనే ఆందోళన నెలకొంది.

రాజకీయ వివరాలు ఎందుకో?

గత పదేళ్లుగా రాజకీయాల్లో కొత్త మార్పులు వచ్చాయి. ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి మారిపోయారు. అయితే ప్రస్తుతం రాజకీయ సర్వేలో మీరేమైనా ప్రజాప్రతినిధా అయితే అప్పుడు ఏఏ పదవుల్లో పనిచేశారు. ఎన్ని సార్లు పని చేశారు. అప్పుడు ఏ పార్టీలో ఉన్నారు. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారనే వివరాలు తీసుకుంటున్నారు. అసలు రాజకీయ వివరాలు ఎందుకు తీసుకుంటున్నారన్నది అర్థంకాని ప్రశ్నగా మారింది.

కొన్ని ప్రశ్నలను దాటవేస్తున్న ప్రజలు

సర్వే సందర్భంగా ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లు అడుగుతున్న కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే ప్రజలు దాటవేస్తున్నారు. వాహనాలు, వ్యవసాయ భూములు, ఇతర ఆర్థిక పరమైన వాటిని చెప్పేందుకు ఇష్టపడటం లేదు. ప్రభుత్వం సర్వే స్వచ్ఛందమే అని పేర్కొనడంతో వారు చెప్పిన సమాచారాన్ని తీసుకుని ఎన్యుమరేటర్లు దరఖాస్తు ఫారాలు నింపాల్సి వస్తోంది.

వివరాలు చెప్పాలంటే ఇబ్బందిగానే ఉంది



ఎన్యూమరేటర్లకు వివరాలు చెప్పాలంటే ఇబ్బందిగా ఉంది. ఏ వివరాలు చెప్పాలో... ఏ వివరాలు చెప్పకూడదో అర్థం కావడం లేదు. పూర్తి వివరాలు సేకరించి పథకాలను రద్దు చేసే అవకాశం ఉందనే టెన్షన్ ఉంది. కులగణన ఓకే కానీ, ఆస్తుల వివరాలు సేకరించడం బాగా లేదు.

– రాపోలు మార్కండేయ, చేనేత కార్మికుడు, గట్టుప్పల్

పథకాలు రద్దు చేస్తారనే అనుమానం ఉంది



సర్వే ఎందుకు చేస్తున్నారనే వివరాలను సర్వేకు వచ్చిన అధికారులు చెప్పడం లేదు. ఇళ్లు, వ్యవసాయ భూములు, ఇతర ఆస్తుల వివరాలను తీసుకుంటున్నారు. ఆ సర్వేలో ఇచ్చిన వివరాల ఆధారంగా మాకు ప్రస్తుతం వస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తారనే అనుమానం ఉంది.

– గరిషే నరేష్, గుండ్రాంపల్లి, చిట్యాల

కొన్ని విషయాలు చెప్పాలనిపించడం లేదు



సర్వేకు వచ్చిన వారు సొంత విషయాలు అడుగుతున్నారు. ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి. లోన్ ఎంత ఉంది. ఎంత భూమి ఉంది, ఎన్ని ప్లాట్లు ఉన్నాయనే వాటితోపాటు చాలా వివరాలు అడిగారు. ఆ విషయాలు చెప్పాలంటే భయం వేస్తోంది. అన్ని ఉన్నాయంటూ ప్రభుత్వ పథకాలను తొలగిస్తారనే అనుమానం వస్తోంది.

– రమావత్ రాంకోటి, పోల్యానాయక్‌తండా, చందంపేట

వ్యక్తిగత సమాచారం అడుగుతున్నారు



సర్వేలో కులానికి సంబంధించిన వివరాలే తీసుకోవాలి. కానీ 75 రకాల సమాచారం అడుగుతున్నారు. భూమి పాస్‌బుక్, వాహనాలు తదితర వ్యక్తిగత సమాచారం అడుగుతున్నారు. ఆ సమాచారం ఇవ్వడం మాకు ఇష్టం లేదు. ప్రభుత్వ పథకాలు వస్తాయో రావోగానీ ఉన్నవి పోతాయనే అనుమానం వస్తోంది.

– ఎల్లంకి అశోక్, చింతపల్లి

కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



వల్లభాపురంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం నిడమనూరు మండలంలో పర్యటించి నిడమనూరు, తుమ్మడం, రాజన్నగూడెం, వల్లభాపురం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. సూపర్ వైజర్లు వారి పరిధిలోని గ్రామాల వారీగా ఇళ్ల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ త్రిపాఠి మాట్లాడుతూ.. సర్వే నిర్వహిస్తున్న సమాచారాన్ని ముందే ప్రజలకు తెలియజేస్తే సిద్ధంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చారి, ఎంపీడీఓ వెంకటేశం, స్పెషల్ అధికారి కృష్ణవేణి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పలువురు సర్వే సిబ్బంది తొలగింపు

నిడమనూరు మండలంలో సర్వే చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు సిబ్బందిని మార్చాలని తహసీల్దార్ కృష్ణ చారి, ఎంపీడీఓ వెంకటేశం, స్పెషల్ అధికారి క్రిష్ణవేణిని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. తుమ్మడంలో సర్వే సూపర్‌వైజర్ శ్రీనివాస్ పనితీరు సరిగా లేకపోవడంతో అతడిని మార్చాలని, రెమ్యునరేషన్ నిలిపి వేయాలన్నారు. రాజన్నగూడెంలో ఎన్యుమరేటర్ కుటుంబ యజమానుల నుంచి సమాచార సేకరణలో ఇబ్బంది పడుతున్నారని వారికి మరోసారి అవగాహన కల్పించాలన్నారు. వల్లభాపురం గ్రామంలో తక్కువ ఇళ్లను సర్వే చేయడంతో పంచాయతీ కార్యదర్శి మోహన్‌ను మందలించారు.

కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించాలి

త్రిపురారం: కొనుగోలు చేసి కాంటా వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నిడమనూరు మండలంలోని ఊట్కూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ దుర్గారెడ్డి, ఎంపీడీఓ సుజాత ఉన్నారు.

మద్దతు ధర పొందాలి



హాలియా వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కొత్తపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో హాలియా వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఇప్పటికే జిల్లాలో 68,000వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, మొత్తం 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో సన్నరకం ధాన్యం కోసం 80 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం హాలియాలో చేపట్టిన సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఆమె వెంట డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మిల్లర్స్ చిట్టిప్రోలు యాదగిరి, నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, నాగిరెడ్డి, కమిషనర్ రామదుర్గారెడ్డి ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- ఎస్పీ శరత్‌చంద్రపవార్



వాడపల్లి చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

మిర్యాలగూడ: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ హెచ్చరించారు. మంగళవారం మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో పలు రైస్ మిల్లులను ఆయన సందర్శించారు. మిల్లు వద్దకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మిల్లర్లు సూచించారు. ఏరోజుకారోజు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులను వేచి ఉండేలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు విషయంలో రైతులను మోసం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక ఎంవీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్ఐలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని తెలంగాణలోకి అనుమతించబోం

మిర్యాలగూడ: ఖరీఫ్ సీజన్‌లో ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని తెలంగాణలోకి అనుమతించబోమని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు అయిన దామరచర్ల మండలంలోని వాడపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర రాష్ట్రాల ధాన్యం తెలంగాణలోకి రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎస్ఐ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

సాఫీగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

- మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ: మిర్యాలగూడలో ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లుల వద్ద అన్ని రకాల ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు మిర్యాలగూడలో ధాన్యం విక్రయించేందుకు ఆయా మండలాల్లోని వ్యవసాయశాఖ అధికారుల ద్వారా టోకెన్లు పొందాలన్నారు. ప్రతిరోజు రైస్ మిల్లులను తనిఖీ చేసి మద్దతు ధర విషయంలో రైతుల ద్వారా తెలుసుకుంటామన్నారు. రైతులు మిల్లుల వద్ద ధాన్యానికి లభించిన రేటు నచ్చితేనే అమ్మాలని లేకుంటే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.


పత్తి మిల్లు వద్ద రైతుల ఆందోళన



యరగండ్లపల్లిలో పత్తి మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మర్రిగూడ: మండల పరిధిలోని యరగండ్లపల్లిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆగ్రో పత్తి మిల్లు వద్ద పత్తి కొనుగోళ్లు నిలిపివేశారని మంగళవారం రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తి మిల్లు నుంచి రోజుకు 1200– 1500 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధనలు ఉన్నాయని సీసీఐ అధికారులు పేర్కొనడం బాధాకరమన్నారు. దళారుల పత్తిని కొనుగోలు చేసి రైతులకు నిబంధనలను పెట్టడం సరికాదన్నారు. రోజుల తరబడి రైతులు సీసీఐల వద్ద పడిగాపులు కాస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం లేదన్నారు. గత మూడు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో సమస్యలు తలెత్తినట్లు పేర్కొన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే నిబంధనలు ఎత్తివేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో ట్రాఫిక్ జాం కావడంతో మర్రిగూడ పోలీసులు అక్కడకు చేరుకుని, రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

గొల్ల, కుర్మలను సంచార జాతులుగా గుర్తించాలి



కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, చిత్రంలో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

మునుగోడు: గొల్ల, కుర్మలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం సంచార జాతులుగా గుర్తించి, ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్ కోరారు. మంగళవారం మునుగోడులోని బస్టాండ్ ఆవరణలో కుర్మ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన కొమురయ్య పేరును తెలంగాణలోని ఏదో ఒక జిల్లాకు పెట్టాలన్నారు. అగ్రకులాల నేతలు బీసీలను రాజకీయంగా అణచివేతకు గురిచేస్తున్నారని, బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పదవులు అనుభవిస్తున్న నేతలు గొల్లకుర్మల ఓట్లతో గెలుపొంది వారి విగ్రహాల ఆవిష్కరణకు వచ్చే సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. కొమురయ్య కేవలం కులానికి మాత్రమే కాదని తెలంగాణ జాతికి నాయకుడన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరిగి నర్సింహ, కుండే వెంకటేష్, మందుల సత్యం, రావుల ఐలయ్య, బండారి శంకర్, శ్రీను, కాలిన మల్లేష్ పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల తర్వాత సొంత శాఖకు..

- డిప్యుటేషన్‌పై ఇతర శాఖల్లోకి వెళ్లిన గృహ నిర్మాణ శాఖ సిబ్బంది
- వారందరినీ రిలీవ్ చేయాలని ప్రభుత్వం ఆదేశం
- తిరిగి మాతృ శాఖకు వస్తున్న ఉద్యోగులు
- ఇప్పటికే డీఈ, మేనేజర్, ఏఈ రాక
- త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది వచ్చే అవకాశం



నల్లగొండ: జిల్లాలో గృహ నిర్మాణ(హౌసింగ్) శాఖకు పూర్వ వైభవం రానుంది. ఈ శాఖలో పనిచేసే సిబ్బందిని ఎనిమిదేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై ఇతర శాఖలకు ప్రభుత్వం పంపింది. మరలా తిరిగి సొంత శాఖకు సిబ్బందిని రిలీవ్ చేయాలని ఆదేశించిందంతో పాత సిబ్బంది అంతా తిరిగి వస్తున్నారు.

2016లో ఇతర శాఖలకు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గృహ నిర్మాణ శాఖలో 100 మందికిపైగా అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఇందులో ప్రధానంగా ఒక పీడీతోపాటు నలుగురు ఎగ్జిక్యూటివ్‌లు, 12 నియోజకవర్గాలకు 12 మంది డీఈలు, మండలానికి ఒక ఏఈతో పాటు ఒక్కో మండలంలో ఇద్దరు నుంచి ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ వారు ఉన్నారు. వారితోపాటు ఆఫీస్ స్టాఫ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు ఉన్నారు. అయితే 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మార్చి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చి దాని నిర్మాణ బాధ్యతలు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించడంతో గృహ నిర్మాణ శాఖతో పనిలేకుండా పోయింది. దీంతో 2016లో గృహ నిర్మాణ శాఖలో ఉన్న సిబ్బందిని ఒక పీడీ మినహా మిగిలిన ఇంజనీర్లు, రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఇతర ఆఫీస్ సిబ్బందిని ఇతర శాఖలకు డిప్యుటేషన్‌పై పంపింది. అదే సందర్భంలో కాంట్రాక్టు వర్క్ ఇన్‌స్పెక్టర్లను తొలగించారు.

సొంత శాఖకు హౌసింగ్ సిబ్బంది

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ఇందిరమ్మ పథకం పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా 3,500 వ్యక్తిగత గృహాలు నిర్మిస్తామని ప్రకటించింది. దీంతో గృహ నిర్మాణ శాఖ నుంచి ఇతర శాఖలకు వెళ్లిన సిబ్బందిని ఆయా శాఖలు రిలీవ్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గృహనిర్మాణ శాఖకు సంబంధించిన ఉద్యోగులు ఏ శాఖలో పని చేస్తున్నారో ఆ శాఖలన్నీ వెంటనే ఆయా ఉద్యోగులను రిలీవ్ చేయాలని ప్రభుత్వం జీఓ 113ని విడుదల చేసింది. దీంతో ఇంత కాలం ఇతర శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నల్లగొండలోని గృహ నిర్మాణ శాఖకు తరలి వస్తున్నారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖలో వైద్యవిధాన పరిషత్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిన డీఈ ఎల్.లోకిలాల్‌తో పాటు మరో శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లిన మేనేజర్ డి.లవ, ఏఈ వెంకటేశ్వర్లు ఆయా శాఖల నుంచి రిలీవ్ అయి నల్లగొండ గృహ నిర్మాణ శాఖలో విధుల్లో చేరారు. త్వరలోనే మిగతా సిబ్బంది కూడా ఆయా శాఖల నుంచి రిలీవ్ అయి సొంత శాఖలో చేరనున్నారు.

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల రైళ్ల కింద పడి ఇద్దరు మృతి

భువనగిరి క్రైం, బీబీనగర్: బీబీనగర్ మండల పరిధిలోని వేర్వేరు చోట్ల రైళ్ల కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పగిడిపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ఎగువ లైన్‌లో 18519 ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు(30) మృతిచెందాడు. అదేవిధంగా సోమవారం రాత్రి బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో దిగువ లైన్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(40) మృతిచెందాడు. రెండు మృతదేహాలను భువనగిరి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుల వివరాలు తెలిసిన వారు 9848222169, 8712568454 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కల్వర్టును ఢీకొని యువకుడి దుర్మరణం

ఆలేరురూరల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆలేరు పట్టణంలోని బైపాస్ రోడ్డుపై గల కల్వర్టును ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన డి. రామకృష్ణ(26) మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో ఆలేరు పట్టణంలోని బైపాస్ రోడ్డులో మ్యాడీస్ హోటల్ దగ్గరకి రాగానే జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టి రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

తిప్పర్తి: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని కారు ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటన తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓర్సు రాములమ్మ(65) సోమవారం రాత్రి రామలింగాలగూడెం నుంచి జంగారెడ్డిగూడేనికి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. మల్లేపల్లివారిగూడెం సమీపంలో వెనుక నుంచి కారు వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో రాములమ్మకు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మంగళవారం మృతురాలి కుమారుడు ఓర్సు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన సిరికొండ ఐలయ్య(38) ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరి చర్లపల్లి సత్యాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ పనుల్లో కదలిక

- దండుమల్కాపురంలో ఎనిమిదేళ్ల క్రితం శంకుస్థాపన
- ఆటోమేటెడ్ మిషన్లు రాకపోవడం, క్రషర్ మిల్లు యాజమాన్యం కేసుతో ఆగిన పనులు
- ఇటీవల ప్రభుత్వానికి అనుకూలంగా కోర్టు తీర్పు
- కొనసాగుతున్న ప్రహరీ, సెక్యూరిటీ రూం నిర్మాణం
- మూడు నెలల్లో మిషన్లు వస్తాయంటున్న రవాణా శాఖ అధికారులు



దండుమల్కాపురంలో వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటయ్యేది ఇక్కడే..

చౌటుప్పల్ రూరల్: వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్‌ల్లో అవినీతిని అరికట్టేందుకు, ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్ల మీద తిరగకుండా నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లో ఆటోమేటెడ్ యంత్రాలతో వాహనాల ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మన రాష్ట్రానికి సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా 2015లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ సమీపంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి పక్కనే 8 నుంచి 12 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.14.40కోట్లతో వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్, ఉద్యోగులు ఉండేందుకు భవనం పూర్తయినప్పటికీ.. స్పెయిన్ నుంచి రావాల్సిన వాహనాలను టెస్టింగ్ చేసే మిషన్లు కొన్ని కారణాల వల్ల రాలేదు. దీనికి తోడు ఫిట్‌నెస్ సెంటర్ ఇక్కడ నిర్మించొద్దని పక్కన ఉన్న క్రషర్ మిల్లు యాజమాన్యం కోర్టులో కేసు వేసింది. దీంతో ఎనిమిదేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ఇటీవల కోర్టులో వేసిన కేసుకు సంబంధించి ప్రభుత్వం వైపే తీర్పు రావడంతో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం ఫిట్‌నెస్ సెంటర్ చుట్టూ ప్రహరీ, సెక్యూరిటీ రూం నిర్మిస్తున్నారు. మరో మూడు నెలల్లో గుజరాత్ నుంచి మిషన్లు ఫిట్‌నెస్ సెంటర్‌కు రానున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

దేశంలోనే మూడోది..

దేశంలోనే మొట్టమొదటిసారిగా మహారాష్ట్రలోని నాసిక్‌లో ఆటోమేటెడ్ వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తర్వాత ఢిల్లీలోని రోహ్‌తక్‌లో ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటైంది. తెలంగాణలో దండుమల్కాపురం గ్రామ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ దేశంలోనే మూడోది అని అధికారులు చెబుతున్నారు. దీనితో పాటు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, మధ్యప్రదేశ్‌లోని చిన్వాడ్, కర్ణాటకలోని బెంగళూరు, రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు చురుకుగా కొనసాగుతున్నాయి.

రోజుకు 400పైగా వాహనాలకు ఫిట్‌నెస్ టెస్ట్

దండుమల్కాపురంలోని వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభమైతే ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని వాహనాలన్నీ ఇక్కడే ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాల్సి ఉంటుంది. అధునాతన మిషన్లతో ఫిట్‌నెస్ చెక్ చేయడం ద్వారా మళ్లీ రెండేళ్ల వరకు ఫిట్‌నెస్ చెక్ చేయనక్కర్లేదు. ఫిట్‌నెస్ సెంటర్‌లో వాహనానికి హెడ్‌లైట్స్, స్టీరింగ్, బ్రేకులు, ఇంజన్, ఇంజన్ వల్ల వచ్చే కాలుష్యం, వాహనం కండీషన్‌ను పరీక్షిస్తారు. ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోతే రిపేర్ గ్యారేజీలకు పంపిస్తారు. దీని వల్ల దండుమల్కాపురం గ్రామ పరిధిలో సుమారు 10కి.మీ.ల వరకు మెకానిక్ షెడ్స్ ఏర్పాటై ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

వాహనదారులకు సులభతరం అవుతుంది



దండుమల్కాపురంలో ఏర్పాటవుతున్న వెహికిల్ ఫిట్‌నెస్ సెంటర్ పూర్తిగా ఆటోమేటెడ్. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల వాహనదారులకు ఫిట్‌నెస్ చెకింగ్ సులభం అవుతుంది. ఎలాంటి ఆటంకాలు లేకపోతే మరో 6 నెలల్లో సెంటర్ ప్రారంభమవుతుంది. రవాణ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ మండలాల హెవీ వెహికిల్స్ ఫిట్‌నెస్ టెస్ట్ ఇక్కడే చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం.

– బి. సాయికృష్ణ, యాదాద్రి భువనగిరి జిల్లా రవాణాధికారి

విద్యుదాఘాతంతో రైతు మృతి



సైదులు (ఫైల్)

మునగాల: ట్రాక్టర్‌లోని ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా.. ట్రాక్టర్ ట్రాలీకి విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం తాడువాయి గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడువాయి గ్రామానికి చెందిన చిర్రా సైదులు(55) తన సొంత ట్రాక్టర్‌లో తన వ్యవసాయ భూమిలో పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మంగళవారం వచ్చాడు. ధాన్యాన్ని ఆరబోసేందుకు ట్రాక్టర్ ట్రక్కును పైకి లేపే ప్రయత్నం చేయగా.. పైన ఉన్న విద్యుత్ తీగలు ట్రాక్టర్ ట్రాలీకి తగలడంతో విద్యుదాఘాతానికి గురై డ్రైవింగ్ సీటులో ఉన్న సైదులు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భైరవునిబండ గ్రామంలో పశువుల కాపరి..



యాదయ్య (ఫైల్)

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామంలో జరిగింది. మంగళవారం ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. భైరవునిబండ గ్రామానికి చెందిన పులిగిల్ల గంగయ్య సోమవారం ఊరికి వెళ్తూ తన గేదెలను మేపేందుకు గ్రామానికే చెందిన మణికొండ యాదయ్య(58)ను ఒక్కరోజు కూలీగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో యాదయ్య గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో గంగయ్యకు చెందిన గేదెలను మేపేందుకు తోలుకెళ్లాడు. గేదెలను మేపుతుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగ యాదయ్య కాలికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. పక్కనే గేదెలను మేపుతున్న పశువుల కాపరులు గమనించి యాదయ్య వద్దకు రాగా అప్పటికే అతడు మృతిచెందాడు. విషయాన్ని గ్రామస్తులకు తెలుపడంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడకు చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. మంగళవారం మృతుడి కుమారుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



రోజా (ఫైల్)

చింతపల్లి: గ్రామస్తుల సూటిపోటి మాటలతో మనస్తాపానికి గురై ఉరేసుకున్న వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటన చింతపల్లి మండలం ధైర్యపురితండాలో జరిగింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ధైర్యపురితండాకు చెందిన వాంకుడోత్ హరినాయక్, రోజా(25) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. వీరు తండాలో కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే తండాకు చెందిన వాంకుడోత్ కళ్యాణ్ కొన్నిరోజుల నుంచి రోజాను ప్రేమిస్తున్నానని ఆమె వెంట పడుతున్నాడు. ఆమెకు ఒక సెల్‌ఫోన్ కొనిచ్చి పెళ్లి చేసుకుంటానని కళ్యాణ్ చెప్పడంతో అతడిని నమ్మిన రోజా గత నెల 26వ తేదీన అతడితో కలిసి కారులో వరంగల్ పారిపోయారు. రోజా కుటుంబ సభ్యులు, భర్త వాంకుడోత్ హరినాయక్ ఈ విషయమై కళ్యాణ్ కుటుంబ సభ్యులను నిలదీయడంతో మరుసటిరోజు రోజాను కళ్యాణ్ తిరిగి గ్రామానికి తీసుకొచ్చాడు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకొని రోజా తన భర్త వెంట కాపురానికి వెళ్లింది. అప్పటి నుంచి కళ్యాణ్ తల్లిదండ్రులు వాంకుడోత్ వెంకటి, శారద సూటిపూటి మాటలతో రోజాను వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల 30వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త వాంకుడోత్ హరి నాయక్ ఫిర్యాదు మేరకు వాంకుడోత్ కళ్యాణ్, అతడి తల్లిదండ్రులు వెంకటి, శారదతో పాటు కళ్యాణ్ బంధువులు రమావత్ రమేష్, శ్రీరామ్, వాంకుడోత్ పవన్, కిషన్, రవి, విజయ్, లచ్చు, కారు డ్రైవర్ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి: కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి చొరవతో అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం భూదాన్‌పోచంపల్లి మండలం గౌస్‌కొండ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో రైతులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతులు తాము పండించిన ధాన్యం అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో ఆయన ఇటీవల గౌస్‌కొండ, రేవనపల్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారని పేర్కొన్నారు. కొనుగోళ్లను త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశించడంతో జిల్లా అధికారులు స్పందించి మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, దోసపాటి అంజయ్య, దేవేందర్‌గౌడ్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టును దర్శించుకున్న అఘోరీ

నార్కట్‌పల్లి: వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అఘోరీ నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై పార్వతీ జడల రామలింగేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకుంది. పంచరామాలను దర్శించుకుని హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో చెర్వుగట్టును దర్శించుకునేందుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. దుస్తులు ధరించి స్వామివారిని దర్శనం చేసుకోవాలని దేవాలయ అధికారులు సూచించడంతో అఘోరీ దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకుంది. భక్తులు మహిళా అఘోరీని చూడటానికి ఎగబడ్డారు.



చెర్వుగట్టులో పూజలు చేస్తున్న అఘోరీ

స్వర్ణ తాపడానికి రూ.5లక్షల విరాళం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం హైదరాబాద్‌కు చెందిన రాగాల శివశాంత్ కుమార్, రాగాల శ్రీనివాస్ రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. మంగళవారం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం శివశాంత్ కుమార్, శ్రీనివాస్ రాగాల ఫౌండేషన్, రాగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ డీజీపీ ఆర్‌కే రాగాల జ్ఞాపకార్థం రూ.5లక్షల చెక్కును ఈఓ భాస్కర్ రావుకు అందించారు.



ఈఓ భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న శివశాంత్ కుమార్, శ్రీనివాస్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- ఆమెతో పాటు హోటల్ క్వార్టర్స్‌లో ఉంటున్న యువకుడు పరారీ
- అతడే హత్య చేసినట్లు భావిస్తున్న పోలీసులు



ఝాన్సీ మృతదేహం

కేతేపల్లి: కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో గల 'మా పల్లె రుచులు' హోటల్‌లో పనిచేసే మహిళ హోటల్ సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్స్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆమెతో పాటు ఉంటున్న యువకుడు కనిపించకపోవడంతో అతడే హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. హోటల్ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన గంగాధర ఝాన్సీ (35), నల్లగొండ జిల్లా పెద్దవూర మండలానికి చెందిన పెద్దమళ్ల కోటేశ్వరావు అలియాస్ బన్నీ కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట గల మా పల్లె రుచులు హోటల్‌లో ఇరవై రోజుల క్రితం పనిలో చేరారు. వీరు హోటల్ వెనకాల సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. ఝాన్సీకి పెళ్లై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఝాన్సీ, బన్నీ ఒకే హోటల్‌లో పనిచేస్తుండటంతో వీరి మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో వీరిద్దరూ హోటల్‌లోని క్వార్టర్స్‌లో ఒకే గదిలో నివాసముంటున్నారు. సోమవారం రాత్రి హోటల్‌లో విధులు ముగించుకుని తమ గదికి వెళ్లిన బన్నీ, ఝాన్సీ మంగళవారం ఉదయం నిద్రలేచి హోటల్‌లో టిఫిన్ చేసి తిరిగి గదికి వెళ్లారు. మధ్యాహ్నం వరకు వారు విధులకు రాకపోవడంతో అనుమానం వచ్చిన హోటల్ యాజమాన్యం గదిలోకి వెళ్లి చూడగా ఝాన్సీ విగతజీవిగా మంచంలో పడి ఉంది. బన్నీ కోసం వెతకగా అతడి ఆచూకీ లభించలేదు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. నల్లగొండ నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బన్నీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

గోవులను తరలిస్తున్న వాహనాలు స్వాధీనం



వాహనంలోని గోవులు

మునగాల: కోదాడ నుంచి హైదరాబాద్ వైపు గోవులను తరలిస్తున్న రెండు వాహనాలను మంగళవారం మునగాల మండల కేంద్రం శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి రెండు టాటా ఏస్ వాహనాలలో 17 గోవులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మునగాల మండల కేంద్రంలో శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి ఓ వాహనం డ్రైవర్ పరారు కాగా.. రెండో వాహనం డ్రైవర్‌ను పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా నామవరం గ్రామానికి చెందిన గొడ్ల బాబ్జి జగ్గంపేట నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు గోవులను తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. మొదటి వాహనంలో 9, రెండో వాహనంలో 8 గోవులు ఉన్నట్లు గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు, పట్టుబడిన గోవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాగు ఆక్రమించిన వారిపై కేసు నమోదు

యాదగిరిగుట్ట రూరల్: వాగును ఆక్రమించిన వారిపై యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామానికి చెందిన గౌడ సిద్దులు, సైదాపురం గ్రామానికి చెందిన కనుకుల సిద్దారెడ్డి మల్లాపురం గ్రామంలోని వాగును ఆక్రమించారు. వీరిపై ఇరిగేషన్ ఏఈఈ తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పబ్లిక్ ప్రాపర్టీస్ డామేజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.

రైతులకు బోనస్ కలేనా..?

- సన్న రకం ధాన్యాన్ని మిల్లులకే తరలిస్తున్న అన్నదాతలు
- 17శాతం తేమ ఉండాలనే నిబంధనతో వర్షాల భయంతో ధాన్యాన్ని ఆరబెట్టలేక ఎప్పటికప్పుడు మిల్లులకు తరలింపు
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తేనే బోనస్



మిర్యాలగూడ పరిధిలో రైస్ మిల్లు ముందు బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

మిర్యాలగూడ: రైతులు పండించిన వరి పంటకు బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం దానికి అనుగుణంగానే సన్న ధాన్యానికి ఈ సీజన్‌లో రూ.500 బోనస్ ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే గ్రేడ్–1 ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ కల్పిస్తామని ప్రకటించారు. 17శాతం తేమ కచ్చితంగా ఉండాలని, పొట్టు, తాలు, మట్టి పెల్లలు లేకుండా ఉండాలని నిబంధన పెట్టారు. అయితే 17శాతం తేమ ఉండాలంటే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తుంది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితుల్లో రైతులు బోనస్ విషయం పట్టించుకోకుండా ధాన్యాన్ని నేరుగా మిల్లుల్లోనే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధర వస్తున్నప్పటికీ మిల్లుల్లోనే ధాన్యం అమ్ముకుంటున్నారు.

మిల్లులకే సన్న ధాన్యం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో రైతులు సన్న రకం ధాన్యం ఎక్కువగా సాగు చేశారు. దొడ్డురకం ధాన్యం కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. సన్న రకం పచ్చి ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడంతో రైతులందరు మిల్లులకే ధాన్యాన్ని తరలిస్తున్నారు. మిల్లర్లు 25 నుంచి 30శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా తాలు, పొట్టు, మట్టి పెల్లల గురించి మిల్లర్లు పట్టించుకోకపోవడంతో పంట కోసిన వెంటనే రైతులు ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నారు. దీంతో మిల్లుల వద్ద కిలోమీటర్ల మేర ధాన్యం ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 30శాతం ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేసినట్లు సమాచారం. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ 17శాతం తేమ ఉండాలనే నిబంధనతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది.

సన్న రకం ధాన్యం సాగు వివరాలు..

జిల్లా	ఎకరాలు	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)	కొనుగోలు కేంద్రాలు
నల్లగొండ	2,42,490	5,81,975	82
సూర్యాపేట	3,41,650	8,15,960	133
యాదాద్రి	97,028	1,74,650	32

15.72లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 15.72లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా చేశారు. నల్లగొండ జిల్లాలో 2,42,490 ఎకరాల్లో సన్నాలు సాగు చేయగా 5,81,975 మెట్రిక్ టన్నులు, సూర్యాపేట జిల్లాలో 3,41,650 ఎకరాల్లో సాగు చేయగా 8,15,960 మెట్రిక్ టన్నులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 97,028 ఎకరాల్లో పంట సాగు చేయగా 1,74,650 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా చేశారు. ఇప్పటివరకు సుమారు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఇప్పటివరకు గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. ఇలా అయితే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఎలా పంపిణీ చేస్తారనే అనుమానాలు కలుగుతున్నాయి. మిల్లర్ల నుంచి సన్న బియ్యం కొనుగోలు చేసి పేదలకు ఇస్తే ప్రభుత్వంపై మరింత భారం పడుతుంది.

మహేంద్ర చింట్లు కొనని మిల్లర్లు..

దిగుబడి ఎక్కువగా వస్తుందని మహేంద్ర చింట్లు, 101 వరి వంగడాలను సాగు చేసిన రైతులకు మిల్లర్లు చుక్కలు చూపిస్తున్నారు. ఆ రకం ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు ముందుకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 70వేల ఎకరాలకు పైగా ఈ రకం వరి సాగు చేశారు. కానీ ఈ రకం ధాన్యంలో గింజ లావుగా ఉంటుందని, ఇది సన్న బియ్యం వెరైటీకి సరిపోదని కారణంతో మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. అధికారులు అనేకమార్లు మిల్లర్లతో సమావేశం జరిపి ఆ రకం ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ధాన్యం రాక కోసం ఎదురుచూస్తున్నాం

సన్నరకం ధాన్యం కొనుగోలు కోసం నల్లగొండ జిల్లాలో 82 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆయకట్టులో ఎక్కువగా సన్నరకం ధాన్యం సాగు చేయడం వల్ల ఇప్పుడిప్పుడే కోతలు జరుగుతున్నాయి. ధాన్యం రాకకోసం ఎదురుచూస్తున్నాం. వచ్చిన ధాన్యానికి నిబంధనల ప్రకారం మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తాం. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలి.

– శ్రీనివాస్, అదనపు కలెక్టర్, నల్లగొండ

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మహేశ్వర్ (ఫైల్)

కట్టంగూర్: అప్పుల బాధతో పురుగుల మందు తాగిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన తండుకంట్ల మహేశ్వర్(35) గత ఆరేళ్లుగా తన కున్న రెండున్నర ఎకరాలతో పాటు మరో 4 ఎకరాల భూమిని కౌలు తీసుకొని పత్తి పంట సాగుచేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.6లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పు తెచ్చి పత్తి పంట సాగు చేయగా.. కాలం కలిసిరాక పంట దిగుబడి తగ్గిపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. రవీందర్ తెలిపారు.

భువనగిరి ఖిలాను సందర్శించిన రష్యా దేశస్తులు



భువనగిరి ఖిలా వద్దకు బస్సులో వచ్చిన రష్యా నిపుణుల బృందం

భువనగిరిటౌన్: యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు సమీపంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు మంగళవారం రష్యా దేశం నుంచి 25 మంది నిపుణుల బృందం వచ్చారు. వారు పెద్దకందుకూరు నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతూ భువనగిరి ఖిలాను సందర్శించారు. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీకి చెందిన విక్రమ్ ఆధ్వర్యంలో భువనగిరి ఖిలా పైకి ఎక్కిన వారు ఎత్తైన గ్రానైట్ కొండపై నిర్మాణాలను చూస్తూ చాలాసేపు అక్కడే గడిపారు. వందల సంవత్సరాలుగా ఉన్న నిర్మాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అభిప్రాయపడ్డారు. ఖిలా చరిత్రను గైడ్ వినోద్ వారికి వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE

■ Commercial Vehicle for Sale MAHINDRA BOLERO CAMPER GOLD ZX BS6 Model 2023 Vehicle No: Register No: TS05UF3794, Engine: TTP4E85031 & Chassis No: MA1RY2TTKP3E79120. Contact No:9677035841. INDUSIND BANK - 1Ind floor, Plot No:58,59 Reddy Colony Miryalaguda - 508207 [Y_798509]

Wanted

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. ఫోన్: 9912011899, 9912011499 [SCA24000626]

■ రియల్ ఎస్టేట్ Co.HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. కావలెను. జీ/కమీషన్ + 2వీలర్ + రూం+భో ఫ్రీ. నె॥లక్ష రూ॥. ఫ్రెష్/Exp. ఫోన్: 7416396781 [HA-16464]

■ మర్చంట్ నేవీలో, cruise shipsలో ఖాళీలు. పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్ట్‌మెంట్స్. వ:18–27, Qly: 10th & అబోవ్, లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్. Pvt. Ltd. Hyd, T.G, కోయంబత్తూర్ (TN) ఫోన్: 7893682065 [SCA24000630]

Real Estate

PLOT FOR SALE

■ 242 Sq.Yds. Plot For Sale on Highway Road, 2Acr Land Lease/Rent Available for Fuction Hall. Contact: 8885777477. [Y_1145760]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలుచదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.